క్లుప్తంగా

చప్టాకు తాత్కాలిక మరమ్మతులు



మరమ్మతులు చేయిస్తున్న అధికారులు

పెద్దదోర్నాల: ఇటీవల వర్షాలకు దెబ్బతిన్న గంటవానిపల్లె రహదారిలోని చప్టాకు అధికారులు బుధవారం తాత్కాలికంగా మరమ్మతులు చేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చప్టా భారీగా దెబ్బతిన్న విషయం పాఠకులకు విదితమే. ఈ నేపథ్యంలో తాత్కాలిక మరమ్మతులు నిర్వహించి గ్రామస్తుల రాకపోకలకు ఎటువంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

పుల్లలచెరువు: తల్లులు ఐసీడీఎస్ సేవలను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యవంతమైన బిడ్డలకు జన్మనివ్వాలని నాయుడుపాలెం సెక్టార్ సూపర్‌వైజర్ సుబ్బమ్మ అన్నారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా నాయుడుపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారంపై గర్భిణులకు, బాలింతలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బమ్మ మాట్లాడుతూ గర్భిణులు విధిగా పౌష్టికాహారం తీసుకోవాలని, క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని సూచించారు. కిశోర బాలికల నుంచి బాలింతలు వరకు ఎప్పటికప్పుడు రక్త పరీక్షలు చేయించుకుంటూ తద్వారా వచ్చిన ఫలితాలు ఆధారంగా ఐరన్ మాత్రలు, పౌష్టికాహారం ఇస్తున్నామని తెలిపారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు ఉండే ఆకుకూరలు, కూరగాయలు, పప్పు దినుసులపై అవగాహన కల్పించారు. ముందుగా గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ నారాయణమ్మ, ఏఎన్ఎం జ్యోతి రాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు జయమ్మ, ప్రసన్న, కాశమ్మ, ఆశా కార్యకర్తలు వెంకటమ్మ, జాన్‌బీ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

దొనకొండ: బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారంతోనే ఆరోగ్యం సాధ్యమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ సుభాషిణి తెలిపారు. మండలంలోని ఇండ్లచెరువు, రాగమక్కపల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార వారోత్సవాలపై బాలింతలు, గర్భిణులకు అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం అందించే పోషకాహారాన్ని గర్భిణులు, బాలింతలు తీసుకుంటే మంచిదని, పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉంటారన్నారు. రోజూ క్రమం తప్పకుండా పాలు, గుడ్లు, కూరగాయలు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పి.రమాదేవి, పి.శ్యామల, సుబ్బమ్మ, ఆయాలు పాల్గొన్నారు.

పోలీసుల పహారాలో గణేశ్ నిమజ్జనం

కురిచేడు: మండలంలోని దేకనకొండలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఏర్పాటు చేసుకున్న గణపతి విగ్రహం పూజానంతరం బుధవారం నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో జరుగుతున్న ఘర్షణల కారణంగా డీఎస్పీ లక్ష్మీనారాయణ సూచనల మేరకు సీఐ సుబ్బారావు పర్యవేక్షణలో పోలీసుల పహారాలో గ్రామం ఉండటంతో నిమజ్జన కార్యక్రమం వారు దగ్గరుండి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా నిర్వహించారు. గ్రామాన్ని స్వాధీనం చేసుకుని ఘర్షణలు నివారించటంలో పోలీసులు సఫలమయ్యారు.



పోలీసుల పర్యవేక్షణలో నిమజ్జనం

సాయం అందించడంలో ప్రభుత్వం విఫలం

● ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

దర్శి: విజయవాడ వరద బాధితులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి విమర్శించారు. బుధవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. ఈ సందర్భంగా బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ విజయవాడ ఘటన తమను ఎంతగానో కలచి వేసిందన్నారు. నీటి పారుదల శాఖ ముందస్తు హెచ్చరికలు జారీ చేసినా ప్రభుత్వం ప్రజలను అప్రమత్తం చేయడంలో విఫలమైందని చెప్పారు. ప్రమాదకరంలో ఉన్న వారిని రక్షిత ప్రాంతాలకు తరలించక పోవడంతో ఇప్పటి వరకు 60 మందికిపైగా మృతి చెందారన్నారు. ఇంకా కొందరి ఆచూకీ దొరకలేదని చెప్పారు. ఇంత ఘోరమైన పరిస్థితి రావడం నిజంగా బాధాకరం అన్నారు. ఇంత ప్రమాదకర పరిస్థితుల్లో కూడా బాధితులను రక్షిత ప్రాంతాలకు తరలించక పోవడంతో ప్రజలు ఎక్కడికక్కడ చిక్కుకుని పోయారన్నారు. వరదలు ముంచెత్తిన తర్వాత తమకు తాముగానే సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లారన్నారు. వరదలో చావు బతుకుల మధ్య తమ గోడు ఎవరికి చెప్పుకోవాలో తెలియక లక్షలాది మంది నరకం అనుభవించారని చెప్పారు. పిల్లలకు పాలు, నీరు, ఆహారం చేరక నానా ఇబ్బందులు పడ్డారని విచారం వ్యక్తం చేశారు. వరద తగ్గు ముఖం పట్టిన తర్వాత కూడా కనీస వసతులకు నోచుకోని పరిస్థితుల్లో అక్కడ ప్రజలు బిక్కుబిక్కు మంటూ ఉన్నారని చెప్పారు. రాష్ట్ర రాజధానిలో 12 రోజులుగా లక్షలాది మంది ప్రజలు నరకయాతన అనుభవించడం దారుణంగా ఉందన్నారు. అధికారులతో ప్రభుత్వం పనులు చేయించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. దీంతో ఎందరో సాయం కోసం ఎదురు చూసిన వారికి నిరాశే మిగిలిందన్నారు. వీధులు, నివాసాలు బురదమయంగా మారాయనాన. ఎన్నో వాహనాలు పూర్తిగా నీట మునిగి పోయాయని చెప్పారు. మరి కొందరి షాపుల్లో నీరు చేరి భారీ నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యాపారాల్లో నష్టపోయిన వారికి ఆ నష్టానికి తగిన నష్ట పరిహారం ప్రభుత్వం చెల్లించాలన్నారు. జీవనోపాధి కోల్పోయిన వారికి ప్రభుత్వం నెలనెలా జీవన భృతి కల్పించాలని కోరారు. నివాసాల్లో నీరొచ్చి సామాన్లు కొట్టుకుపోయిన వారికి ఆ నష్టం పూర్తిగా ప్రభుత్వమే భరించాలని ఎమ్మెల్యే బూచేపల్లి డిమాండ్ చేశారు. వాహనాలు, ఇతర సామగ్రి కోల్పోయిన వారిని విస్మరించకుండా కూటమి ప్రభుత్వం వారికి అండగా ఉండి అన్నీ విధాలా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మంచి ఆలోచనతో సాయం చేసిన స్వచ్ఛంద సంస్థలే ఆకలి బాధ నుంచి బాధితులను కాపాడాయాని ఆయన అభినందించారు.



ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి (ఫైల్)

ప్రభుత్వం వేగవంతంగా స్పందించాలి

ప్రభుత్వం పారిశుధ్య పనులు వేగవంతంగా చేపట్టి ఫైరింజన్ల ద్వారా నివాసాల్లో మురుగును తొలగించాలని ఎమ్మెల్యే బూచేపల్లి కోరారు. అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వీధుల్లో బ్లీచింగ్ చల్లి ప్రజలు రోగాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకుకోవాలని సూచించారు. నీటిలో ఉన్న వారి వద్దకు వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందిని పంపి అందరికీ ఆరోగ్య పరీక్షలు చేయించాలని బూచేపల్లి డిమాండ్ చేశారు. సమస్యలు ఉన్న వారికి ప్రత్యేక వైద్య సదుపాయాలు కల్పించాలని కోరారు. జ్వారాలు ఇతర అంటు వ్యాధులు ఉన్న వారి పట్ల ప్రత్యేక శ్రద్ధ కనపరచాలని ఎమ్మెల్యే బూచేపల్లి కోరారు.

వైఎస్సార్ సీపీ నేతకు ఎమ్మెల్యే తాటిపర్తి పరామర్శ



నాగేశ్వరరావును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

పెద్దదోర్నాల: మండల పరిధిలోని హసానబాద్‌లో శస్త్ర చికిత్స చేయించుకున్న వైఎస్సార్ సీపీకో కన్వీనర్ ఒంటేరు నాగేశ్వరరావును ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితిని మండల నాయకులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గంటా రమణారెడ్డి, మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అబ్దుల్ మజీద్, బీసీ సెల్ జిల్లా కార్యదర్శి గుమ్మా యల్లేష్, మండల నాయకులు యక్కంటి వెంకటేశ్వరరెడ్డి, లాలూ నాయక్, మైనారిటీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి దూదేకుల రసూల్, చిన్నగుడిపాడు సర్పంచ్ పవన్‌కుమార్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొని ఒంటేరు నాగేశ్వరరావును పరామర్శించారు.

వరద బాధితులకు ఆర్థిక సాయం



వరద బాధితులకు నగదు అందజేస్తున్న విశ్వబ్రాహ్మణ సంఘ నాయకులు

ముండ్లమూరు (దర్శి): విజయవాడ వరద బాధితులకు జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో రూ.1.10 లక్షల ఆర్థిక సాయం అందజేశారని మండలంలోని వేముల గ్రామానికి చెందిన ఆ సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు నలగట్ల ఈశ్వరాచారి తెలిపారు. విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చేవూరి రామస్వామి ఆధ్వర్యంలో ప్రకాశం జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం తరపున విరాళాలు సేకరించామని చెప్పారు. ఆ మొత్తాన్ని బుధవారం విజయవాడలోని సుభాష్ చంద్రబోస్ నగర్ కండ్రిక వాసులకు ఒక్కో కుటుంబానికి పది హేను వేల రూపాయలు నగదు, చీరెలు, దుప్పట్లు, పంచెలు 50 కుటుంబాలకు అందజేశామని తెలిపారు. విశ్వబ్రాహ్మణ సంఘ జిల్లా అధ్యక్షుడు చెన్నుపల్లి శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి సుతారం శ్రీనివాసాచారి, సంఘ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

తర్లుపాడు: మండలంలోని చెన్నారెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బుధవారం తర్లుపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి, సిబ్బంది ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్యంగా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాసులు, ఉపాధ్యాయుడు కోటిమోహన్, ఏఎన్ఎంలు హెబ్సీబా, సుమ, మల్లీశ్వరీ, స్రవంతి, అనురాధ పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో వినాయక నిమజ్జనం

దొనకొండ: మండలంలోని పలు గ్రామాల్లో యువకులు ఉత్సాహంతో వినాయక నిమజ్జన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. వద్దిపాడు, దొనకొండ, ఇండ్లచెరువు గ్రామాల్లో 5 రోజులు వినాయకునికి పూజా కార్యక్రమం నిర్వహించి భజంత్రీలు, మేళ తాళాలతో నిమజ్జనానికి తరలించారు. ఇండ్లచెరువులో యాదవ సంఘం ఏర్పాటు చేసిన వినాయకుని లడ్డూను కర్రెబోయిన గంగయ్య రూ.20 వేలకు పాడారు. దుబాయి శ్రీను ఏర్పాటు చేసిన వినాయకుని లడ్డూను గుమ్మా వెంకటేశ్వర్లు రూ.5,100కు పాడి లడ్డూను పంచి పెట్టారు. యువకులు ఉత్సాహంతో గులాములు చల్లుకుంటూ నృత్యాలు చేస్తూ నిమజ్జనానికి వినాయకులను తరలించారు.

ఎమ్మెల్యే తాటిపర్తి ప్రత్యేక పూజలు

పెద్దారవీడు: మండల పరిధిలో మద్దలకట్ట పంచాయతీ చాట్లమడ గ్రామంలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన వరసిద్ధి వినాయకుడికి ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు భవానీప్రసాద్ ఆధ్వర్యంలో శివాలయం, వినాయక స్వామి వారికి పూజలు చేసిన తర్వాత తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఎమ్మెల్యేను శాలువా, పూలమాలతో కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. చిన్నారులతో ఎమ్మెల్యే సందడి చేస్తూ కొంత సేపు ఊరేగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పాలిరెడ్డి కృష్ణారెడ్డి, ఎంపీపీ బెజవాడ పెద్ద గురవయ్య, సర్పంచ్ గుంటు గాలెమ్మ, నాయకులు మూల సత్యంరెడ్డి, గాదం శ్రీనివాసులు, దుద్దె కోటిరెడ్డి, ఏర్వ సత్యనారాయణరెడ్డి, తాతిరెడ్డి వెంకటనారయణరెడ్డి పాల్గొన్నారు.

పెద్దారవీడు: మండల కేంద్రం పెద్దారవీడు తూర్పుపల్లె రామాలయంలో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహానికి భక్తులు ఐదు రోజులు ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు మేడవరం రాఘవేంద్ర ఆధ్వర్యంలో వినాయకస్వామికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం నూతన పట్టువస్త్రాలు, పూల మాలతో అలంకరించారు. సాయంత్రం వినాయకుని విగ్రహం ట్రాక్టర్‌పై పెట్టుకొని గ్రామంలోని పురవీధుల్లో ఊరేగింపు కోలాహలంగా కొనసాగింది. ఊరేగింపులో మహిళలు, యువకులు తరలివచ్చి ఆటపాటలతో సందడి చేస్తూ ముందుకు సాగారు. మంగళవారం రాత్రి వినాయకుని చేతిలోని లడ్డూ, కలశం, ఎలకాయలు, నిమ్మకాయలు భక్తుల సమక్షంలో కమిటీ సభ్యులు వేలం నిర్వహించారు. ఊరేగింపు అనంతరం ఊరి చివర ఉన్న చెరువులో వినాయకున్ని నిమజ్జనం చేశారు.



వినాయకుని ఊరేగింపులో సందడి చేస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి



ప్రత్యేక అలంకరణలో దర్శనం ఇస్తున్న గణపయ్య

యర్రగొండపాలెం: స్థానిక కొలుకుల సెంటర్‌లో ఏర్పాటు చేసిన సిద్ధి వినాయక స్వామి అనునిత్యం ఘనంగా పూజలు అందుకుంటున్నారు. బుధవారం 108 రకాల పువ్వులు, ఆకులు, కూరగాయలు, ఫలాలతో స్వామి వారిని అలంకరించారు. గురువారం గణపతి మండపంలో శ్రీనివాస కల్యాణం నిర్వహిస్తున్నామని, దంపతులు ఈ కల్యాణంలో పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

త్రిపురాంతకం: గణపతి నవరాత్రుల సందర్భంగా గ్రామాల్లో ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. రోజూ ప్రత్యేక పూజలు భక్తులు, దంపతులతో నిర్వహిస్తున్నారు. గణపతి ఊరేగింపులు వైభవంగా జరుగుతున్నాయి. త్రిపురాంతకంలో గణపతి ఉత్సవాల సందర్భంగా ఐదో రోజు అన్న ప్రసాద కార్యక్రమాలను భక్తులు ఏర్పాటు చేశారు. గ్రామోత్సవాలను త్రిపురాంతకం, బ్రహ్మంగారి కాలనీ, మేడపి, రాజుపాలేల్లో బైభవంగా నిర్వహించారు. యువకులు జై గణేశా జై జై గణేశా అంటూ నినదిస్తూ ఉత్సవాలు జరిపారు. ముందుగా ఉత్సవాలు పూర్తి చేస్తున్న వారు నిమజ్జన కార్యక్రమాలకు శ్రీశైలం, అమరావతి, నాగార్జునసాగర్‌కు తరలి వెళ్తున్నారు. భక్తులు, మహిళలు ఉత్సవాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.

ముండ్లమూరు (దర్శి): మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం వినాయక నిమజ్జనం కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. మండలంలోని వేంపాడు, నూజిళ్లపల్లి, గంగనపాలెం, జమ్మలమడక, కమ్మవారిపాలెం, చింతలపూడి, పెద ఉల్లగల్లు, కెల్లంపల్లి, రెడ్డినగర్, బంగారమ్మగుట్ట గ్రామాల్లో ఐదో రోజు నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించారు. పసుపుగల్లు గ్రామంలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో బూచేపల్లి అభిమానులు ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద ఐదో రోజు విద్యుత్ ప్రభ ఏర్పాటు చేయడంతో విద్యుత్ కాంతులతో వెలిగిపోతోంది. పలు గ్రామాల్లో వినాయక విగ్రహాల నిమజ్జనం సందర్భంగా వైఎస్సార్ సీపీ అభిమానులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. యువతీ యువకులు కోలాహలంగా గులాములు చల్లుకుంటూ ఉత్సాహంగా పాల్గొన్నారు.

పుల్లలచెరువు: స్థానిక గాంధీ కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన గణేష్‌డికి కన్నుల పండువగా నిమజ్జనోత్సవం బుధవారం నిర్వహించారు. వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన వినాయక విగ్రహానికి నాలుగు రోజులుగా ప్రత్యేక పూజలు నిర్వహించి ఐదో రోజు విగ్రహాన్ని చిన్నా పెద్దా తేడా లేకుండా పాటలు, డీజేలతో యువకుల కేరింతలతో నిమజ్జనోత్సం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి సమర్పించిన 50 కేజీల లడ్డూకు వేలంపాట నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో సందడి నెలకొంది.



పెద్దారవీడులో ఊరేగుతున్న వినాయకుని విగ్రహం



త్రిపురాంతకం బ్రహ్మంగారి కాలనీలో..



పసుపుగల్లులో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభ



పుల్లలచెరువులో నిమజ్జనానికి తరలిస్తున్న వినాయకుడు



ఇండ్లచెరువులో నిమజ్జనానికి తరలిస్తున్న వినాయకుడు

ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు

దర్శి: స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు యూటీఎఫ్ మండల అధ్యక్షుడు మీనిగ శ్రీను, జిల్లా కార్యదర్శులు ధనిరెడ్డి వెంకటరెడ్డిలు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. యూటీఎఫ్ ఏర్పడి 50 ఏళ్లు పూర్తి అయిన సందర్భంగా స్వర్ణోత్సవంలో భాగంగా క్రీడా పోటీలు గురు, శుక్రవారాల్లో నిర్వహిస్తున్నామన్నారు. రన్నింగ్, వాకింగ్, జావలెన్ త్రో, షాట్‌పుట్, క్యారమ్స్, చెస్, షటిల్, క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. మండలంలోని ఉపాధ్యాయుల పాల్గొని కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు.

చదవడం, రాయడం నేర్పించాలి

పుల్లలచెరువు: ఉపాధ్యాయులు విద్యార్థులకు చదవడం, రాయడం నేర్పించాలని ఎంఈవో ఇందిర అన్నారు. బుధవారం మండలంలోని చెన్నంపల్లి పాఠశాలను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థుల సామర్థ్యాలను తనిఖీ చేసి మాట్లాడుతూ ఉపాధ్యాయులు శిక్షణలో నేర్చుకున్న అంశాలను అధ్యయనం చేసుకుని సులభ, నూతన పద్ధతిలో విద్యార్థులకు నేర్పించాలన్నారు. ముఖ్యంగా ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం నేర్పించినప్పుడు విద్యార్థులు చదువుపై దృష్టి పెడతారని చెప్పారు. విద్యార్థుల నోట్ పుస్తకాలను కూడా రోజూ తనిఖీ చేసి వారికి పలు సూచనలు చేయాలన్నారు. మధ్యాహ్న భోజనం ప్రభుత్వం సూచించిన మోనూ ప్రకారం విద్యార్థులకు వండించాలని చెప్పారు. భోజన విషయంలో అశ్రద్ధ చేస్తే చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు.



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఈవో ఇందిర

పెద్దదోర్నాలలో కలెక్టర్ విస్తృత పర్యటన

పెద్దదోర్నాల: మండలంలోని పలు గ్రామాల్లో కలెక్టర్ తమీమ్ అన్సారియా బుధవారం విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా తొలుత మండల పరిధిలోని రామచంద్రకోట గ్రామాన్ని ఆమె సందర్శించి జామ పంటను సాగు చేస్తున్న అంబటి తిరుపతిరెడ్డికి సంబంధించిన పొలాన్ని పరిశీలించారు. జామ పంటతో ఎకరాకు ఎంత ఖర్చు అవుతుంది, సంవత్సరానికి ఎంత ఆదాయం ఉంటుంది తదితర వివరాలను కలెక్టర్ రైతును అడిగి తెలుసుకున్నారు. జామపంట సాగుకు సంబంధించిన ప్లాంటేషన్‌కు జాతీయ ఉపాధి హామీ పథకం కింద రైతుకు 3 సంవత్సరాలకు 4.57 లక్షల రూపాలయలు వంద శాతం సబ్సిడీతో మంజూరు చేశామని, మొదటి సంవత్సరం 2.34 లక్షల రూపాయలు మంజూరు చేస్తామని ఏపీడీ నిర్మల కలెక్టర్‌కు వివరించారు. మార్కాపురం డివిజన్ పరిధిలో ఉద్యాన పంటలను ప్రోత్సహించేలా జాతీయ ఉపాధి హామీ పథకం పటిష్టంగా అమలు చేయాలని కలెక్టర్ ఏపీడీని ఆదేశించారు. అనంతరం ఇటీవల భారీ వర్షాల కారణంగా చిన్నదోర్నాల గ్రామం వద్ద దెబ్బతిన్న తీగలేరు వాగు చప్టాను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం చిన్నదోర్నాల గ్రామం వద్ద ఎండిపోయిన బోరు బావికి వాటర్ రీచార్జి నిర్మాణానికి చేపట్టిన పనులకు శంకుస్థాపన చేశారు. పడిన వర్షం నీటిని బోరు బావులకు రీచార్జి అయ్యేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం కలెక్టర్ మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలను సందర్శించి మొక్కలు నాటారు. కళాశాల అవరణలో నిర్మించిన ఇంకుడు గుంతలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడారు. బాగా చదువుకొని మంచి భవిష్యత్తు పొందాలని ఆకాక్షించారు. ఈ ఆవరణలోనే డిగ్రీ కళాశాలకు సంబంధించిన తరగతులు కూడా జరుగుతున్నాయని, అదనపు గదులు అవసరమని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. అనంతరం సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రోగులకు అందిస్తున్న వైద్య సేవల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలు విభాగాలను పరిశీలించారు. అక్కడి ఉన్న రోగులతో వైద్యులు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. వైద్య సేవలు అందించటంతో అనేక ఫిర్యాధులు వస్తున్నాయని, సేవలు అందించటంలో అలసత్వం వహించిన సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. కలెక్టర్ వెంట మార్కాపురం సబ్ కలెక్టర్ సహదీత్ వెంకట త్రినాథ్, యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు, తహసీల్దార్ శాంతి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



చిన్నదోర్నాల వద్ద దెబ్బతిన్న చప్టాను పరిశీలిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా



జూనియర్ కళాశాలలో మొక్కలు నాటుతున్న కలెక్టర్